సాక్షి రంగారెడ్డి

గురువారం । 28 । సెప్టెంబర్ । 2023



భక్తుల కోలాహలం

గణపతి లడ్డూల వేలం పాటలు ఆయా మండపాల్లో జోరుగా కొనసాగాయి. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 8లో▸



బంగారం పట్టివేత

అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 8లో▸



'చిల్లర' ఇస్తానంటాడు..

చిల్లర డబ్బే పెట్టుబడిగా పలువురిని నమ్మించి మోసం చేస్తున్న వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. 8లో▸

న్యూస్‌రీల్

మహిళలకు ఉపాధి శిక్షణ

మొయినాబాద్: జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు సెక్యూరిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు దుర్గాబాయి మహిళ శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం) జిల్లా అధికారి లక్ష్మీకుమారి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిలుకూరులోని మహిళా ప్రాంగణంలో నాలుగు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. డిగ్రీ చదివి 18–35 సంవత్సరాల వయసు ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు జతచేయాలన్నారు. వివరాలకు 76600 22524, 92993 58112 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీసీ నేతలు

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ సాధనకు పోరాడిన గొప్ప నేత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని బీసీ ఫ్రంట్ రాష్ట్ర చైర్మన్ జి.మల్లేశ్ యాదవ్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు నిరంజన్ అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మల్లేశ్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. బీసీలు రాజ్యాధికారం చేపడితేనే ఆయన ఆత్మ శాంతిస్తుందన్నారు. కార్యక్రమంలో బీసీ ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు కసరమోని కృష్ణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

గర్భిణులకు విధిగా హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించాలి

రాష్ట్ర ఎయిడ్స్, హెచ్‌ఐవీ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ నర్సింహారెడ్డి

షాద్‌నగర్: ప్రతి గర్భిణికి విధిగా హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర ఎయిడ్స్, హెచ్‌ఐవీ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ నర్సింహారెడ్డి వైద్యులకు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ అండ్ టెస్టింగ్ కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఐవీ పరీక్షలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పాజిటివ్ వచ్చిన వారికి ఏఆర్‌టీ మందులు అందజేస్తున్నారా లేదా అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎయిడ్స్ పాజిటివ్ కేసులు ఏ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నాయో అక్కడ మెడికల్ క్యాంపులు నిర్వహించాలని అన్నారు. గర్భిణికి హెచ్‌ఐవీ ఉన్నట్లయితే విధిగా ఏఆర్‌టీ చికిత్స కోసం మందులను అందించాలన్నారు. దీంతో పుట్టబోయే బిడ్డకు వ్యాధి సంక్రమించకుండా ఉంటుందన్నారు. హెచ్‌ఐవీ బారిన పడిన వారికి వైద్యులు, ఆరోగ్య సిబ్బంది మనోధైర్యం నింపాలన్నారు. ఐసీటీ కేంద్రాల్లో సిబ్బంది రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీశైలం, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఐసీటీ కేంద్రం కౌన్సిలర్ శ్యాంసుందర్, ల్యాబ్ టెక్నీషియన్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పీడియాట్రిక్ కార్డియాలజీ వైద్య శిబిరం

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రిలో ఈ నెల 29 నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు పుట్టుకతో వచ్చే గుండె లోపాలను గుర్తించడం కోసం ఉచిత పీడియాట్రిక్ కార్డియాలజీ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. పిల్లల్లో శ్వాస సరిగ్గా అందకపోవడం, వేగంగా శ్వాస తీసుకోవడం, ఎదుగుదల సరిగ్గా లేకపోవడం, బరువు పెరగకపోవడం, పెదవులు పాలిపోయినట్లు కనిపించడం ఉంటే వారిని కార్డియాలజిస్టులకు చూపించాలని కోరారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తున్నామని అన్నారు. చిన్నారులకు ఉచితంగా 2డీ ఎకో పరీక్ష, డాక్టర్ కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 95503 18540 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

దివ్యాంగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు పెంచాలి

సాక్షి, సిటీబ్యూరో: దివ్యాంగ ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్ శాతాన్ని మూడు నుంచి నాలుగు శాతానికి పెంచాలని దివ్యాంగుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోల సైదులు ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం మంత్రి కేటీఆర్, వికలాంగుల కమిషన్ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్ ముదిరాజ్‌లను ప్రతినిధులు బృందం కలిసి వినతిపత్రం సమర్పించింది.

నిమజ్జనానికి సర్వం సిద్ధం



తుర్కయంజాల్: మాసబ్ చెరువు వద్ద నిమజ్జనానికి సిద్ధంగా ఉన్న క్రేన్

నేడు గణేశ్ నిమజ్జనం

- తరలించేందుకు భక్తుల సన్నద్ధం
- 44 చెరువులు.. 20 వేలకుపైగా విగ్రహాలు
- సరూర్‌నగర్ కట్టపై ఐదు, ఇంజాపూర్ ట్యాంకుపై రెండు భారీ క్రేన్లు
- శోభాయాత్ర మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు
- పోలీసు, రెవెన్యూ, విద్యుత్, వైద్య ఆరోగ్య, మున్సిపల్ శాఖలు అలెర్ట్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అశేష భక్తజనంతో తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గౌరీతనయుడు గంగ ఒడికి చేరేందుకు సిద్ధమయ్యాడు. నిత్యపూజలు, అన్నదానాలు, భజనలు, భక్తి గీతాలాపనలతో పరవశించి పోయిన భక్తజనం గురువారం ఘనంగా వీడ్కోలు పలికేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కాలనీ సంక్షేమ సంఘాలు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు, ఇతర అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాల తరలింపు కోసం ఇప్పటికే వాహనాలు సమకూర్చుకున్నారు. రకరకాల పూలు, పండ్లతో వాటిని అలంకరిస్తున్నారు. గురువారం ఉదయం నుంచే డప్పుల దరువులు, డీజే సాంగ్స్‌తో బొజ్జ గణపయ్యను ఊరేగింపుగా నిమజ్జన ప్రదేశాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. శోభాయాత్ర జరిగే బాలాపూర్, చాంద్రాయణగుట్ట, చార్మినార్‌లతో పాటు ఎల్బీనగర్, చంపాపేట్, కర్మన్‌ఘట్, సరూర్‌నగర్, తుర్కయంజాల్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

బాలాపూర్ లడ్డూ వేలంతో మొదలు

భాగ్యనగర గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గురువారం ఉదయం బాలాపూర్ గణపతి వద్ద ప్రత్యేక పూజలు చేయనున్నారు. అశేష భక్తజనం సాక్షిగా లడ్డూ వేలం నిర్వహించనున్నారు. నగరం నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలిరానున్నారు. గత ఏడాది లడ్డూను రూ.24.60 లక్షలకు వంగేటి లక్ష్మారెడ్డి దక్కించుకున్నారు. ఈ ఏడాది సైతం అంతకంటే ఎక్కువ ధరకు కైవసం చేసుకునేందుకు పోటీపడుతున్నారు. ఊరేగింపు తర్వాత ఉదయం 8 గంటలకు బాలాపూర్ చౌరస్తాలో లడ్డూ వేలం పాట ప్రారంభమవుతుంది. అరగంటలో ఈ ప్రక్రియ ముగియనుంది. అనంతరం భారీ ఊరేగింపుగా శోభయాత్ర ప్రారంభమవుతుంది. బాలాపూర్ గణేశుడిని అనుసరిస్తూ ఇతర ప్రాంతాల్లోని విగ్రహాలు ముందుకు సాగనున్నాయి. రాత్రి తొమ్మిదిలోగా భారీ విగ్రహాల నిమజ్జన ప్రక్రియను పూర్తి చేయించాలని పోలీసులు భావిస్తున్నారు. నిమజ్జన మార్గాల్లో దుకాణాలను మూసివేయించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. దారి పొడవునా సీసీ కెమెరాలతో నిఘా పెట్టారు.

చెరువుల వద్ద ఏర్పాట్లు పూర్తి

- జిల్లా వ్యాప్తంగా 44 చెరువులను ఎంపిక చేశారు.
- రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని హఫీజ్‌పేట్ లేక్, గంగారాం పెద్ద చెరువు, గురునాథం చెరువు, దీప్తిశ్రీనగర్ చెరువు, నల్లగండ్ల, ప్రకాష్‌సాగర్ లేక్, గోపి చెరువు, మల్కం చెరువు, దుర్గం చెరువు, ఖాజాగూడ లేక్, నెక్నంపూర్ చెరువు, గండిపేట్, చిలుకూరు, అజీజ్‌నగర్, పొద్దుటూర్, సింగాపూర్‌చెరువు, ఐడీఎల్‌లేక్, పాటికుంట, కాముని చెరువు, పీరం చెరువుల్లో నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు.
- కందుకూరు డివిజన్ పరిధిలోని జల్‌పల్లి పెద్ద చెరువు, మంత్రాల చెరువు, సరూర్‌నగర్ ట్యాంక్, సందే చెరువు, సూర సముద్రం చెరువు, మన్సూరాబాద్ పెద్ద చెరువు, కుర్మల్‌గూడ చెరువు, రావిర్యాల చెరువు, ఫ్యాబ్‌సిటీ చెరువు, కోమటికుంట చెరువు, సుద్దమాన్ కుంట, బాలాపూర్ పెద్ద చెరువు, కొత్వాల్ చెరువు, అమీర్‌పేట చెరువు, అంకంకుంట, సున్నం చెరువు, రామాలయం చెరువుల్లో నిమజ్జనం చేయనున్నారు.
- ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలోని హయత్‌నగర్‌లోని బైరంఖాన్ చెరువు, రావిర్యాల చెరువు, ఇంజాపూర్ ట్యాంక్, ఇబ్రహీంపట్నం, శేరిగూడ, తట్టిఖానా చెరువుల వద్ద ఏర్పాట్లు చేశారు.
- చేవెళ్ల డివిజన్ పరిధిలోని షాబాద్ చెరువు, చేవెళ్ల చెరువు, ఫతేపూర్ కాలువలతో పాటు షాద్‌నగర్ డివిజన్‌లోని బొబ్బిలి చెరువు, బుచ్చిరెడ్డిగూడెంలోని పెరిమాల చెరువుల వద్ద నిమజ్జనం కోసం భారీ ఏర్పాట్లు చేశారు.

అధికారుల పర్యవేక్షణ

ఆయా చెరువుల వద్ద చేపట్టిన ఏర్పాట్లను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. వీటిలో సుమారు 20 వేల విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. సరూర్‌నగర్ చెరువు కట్టపై ఐదు, ఇంజాపూర్ చెరువు కట్టపై మరో రెండు క్రేన్లు రెడీ చేశారు. విగ్రహాల వారీగా నంబర్లు కేటాయించి, వాటికి నిమజ్జన సమయం ఖరారు చేశారు. శోభయాత్ర కొనసాగే ప్రధాన మార్గాల్లో వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు

నిమజ్జనం సందర్భంగా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాట్లు చేసింది. నిమజ్జన ప్రదేశాల్లో తొమ్మిది 500 కేవీఏ అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, పదకొండు 315 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు, పదమూడు 160 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు, మూడు 100 కేవీఏ, నాలుగు 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు సహా ఏబీ కేబుళ్లు, కండక్టర్లు సిద్ధంగా ఉంచినట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆర్ఆర్‌జోన్ సీజీఎం ఆనంద్ తెలిపారు. ఇప్పటికే రోడ్డుకు అడ్డుగా ఉన్న లైన్లను తొలగించారు. వేలాడుతున్న లైన్లను సరి చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు.

ఆయా శాఖల ఆధ్వర్యంలో..

నిమజ్జనం వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీల సిబ్బంది పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపట్టారు. రోడ్లపై పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేందుకు షిఫ్టుల వారీగా సిబ్బందిని నియమించారు. భక్తుల దాహార్తిని తీర్చేందుకు జలమండలి ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయనున్నారు. ప్రధాన మార్గాల్లో మొబైల్ టాయ్‌లెట్లు సిద్ధం చేశారు. వైద్య ఆరోగ్యశాఖ సైతం ఆయా చెరువు కట్టలు, శోభయాత్ర కొనసాగే ప్రధాన మార్గాల్లో ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశారు.



అబ్దుల్లాపూర్‌మెట్: ఇనాంగూడ బైరాన్‌ఖాన్ చెరువు వద్ద కొనసాగుతున్న ఏర్పాట్లు



చైర్మన్ శ్రీకర్‌రెడ్డిని నిలదీస్తున్న సభ్యులు

మదర్ డెయిరీకి రాజకీయ రంగు

- బీఆర్ఎస్ నేతలు పెత్తనం చేస్తున్నారంటూ సభ్యుల ఆగ్రహం
- డైరెక్టర్ల ఎన్నికలు ఎందుకు నిర్వహించలేదని నిలదీత

హయత్‌నగర్: నల్లగొండ–రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సమాఖ్య (నార్మాక్) మదర్ డెయిరీ రాజకీయ రంగు పులుముకుంది. హయత్‌నగర్‌లోని ఎస్‌వీ కన్వెన్షన్ హాలులో బుధవారం నార్మాక్ మదర్ డెయిరీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి మాట్లాడుతుండగా కొందరు సభ్యులు అడ్డు తగిలారు. ప్రతి ఏడాదిలాగే ఈసారి డైరెక్టర్ల ఎన్నికలు ఎందుకు నిర్వహించలేదని నిలదీశారు. ఎన్నికలు లేకుండా సర్వసభ్య సమావేశం ఎందుకు నిర్వహించారని ప్రశ్నించారు. రాజకీయ కారణాలతోనే ఎన్నికలు నిర్వహించలేదని వాదనకు దిగారు. దీంతో చైర్మన్ తన ప్రసంగాన్ని పూర్తి చేయకుండానే వేదికపై నుంచి దిగిపోయారు.

బీఆర్ఎస్ నాయకుల పెత్తనం ఎక్కువైంది..

ప్రశాంతంగా ఉన్న మదర్ డెయిరీలో బీఆర్ఎస్ నాయకుల పెత్తనం ఎక్కువైందని, జిల్లా మంత్రి జోక్యంతో ఎన్నికలు నిర్వహించలేదని కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఐలయ్య అన్నారు. 18 గ్రామీణస్థాయి చైర్మన్ల ఎన్నికలు జరపలేదని దానిని సాకుగా చూపి డైరెక్టర్ల ఎన్నికలు నిర్వహించలేదని విమర్శించారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున ఈ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే బీఆర్ఎస్ నాయకులు ఎన్నికలు జరగకుండా చేస్తున్నారని ఆరోపించారు.

పాడి రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నాం

ఈ సందర్భంగా నార్మాక్ మదర్‌డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. డెయిరీకి అధికంగా పాలు పోసే రైతులకు ప్రైవేటు డెయిరీలకంటే అధిక ధర చెల్లిస్తున్నామని,సభ్యత్వం ఉన్న రైతులు మరణిస్తే వారి కుటుంబాలకు రూ.పది వేలు ఇస్తున్నామని,మృతిచెందిన గేదెకు ఇన్సూరెన్స్ రూ.80 వేలకు పెంచుతున్నట్లు చెప్పారు. ఓటరు లిస్టులో లోపాలున్నాయని, వాటిని సరి చేయాలని కొందరు సభ్యులు అభ్యంతరం తెలిపినందున ఎన్నికల అధికారి డైరెక్టర్ల ఎన్నికలు నిర్వహించలేదని తెలిపారు. ఓటరు లిస్టు సరిచేసి ఎన్నికలు నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ముగిసిన వర్క్‌షాప్

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఎకో టూరిజం తీసుకురావడానికి కృషి చేయాలని టీఎస్ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్ పేర్కొన్నారు. అజీజ్‌నగర్ సమీపంలోని మృగవనిలో రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాష్ట్రంలోని ఆహ్లాదకరమైన అటవీ ప్రాంతాలను ప్రజలకు ఆనందాన్ని పంచే విధంగా తయారు చేసేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. టీఎస్ఎఫ్‌డీసీ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎకో టూరిజం ప్రాజెక్టు మేనేజర్ సుమన్ పాల్గొన్నారు.

సాగరతీరానికి మహా గణపతి

ఖైరతాబాద్: సాగర తీరంలో నిమజ్జనానికి ఖైరతాబాద్ మహా గణపతి సిద్ధమయ్యాడు. ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీసులు, వివిధ శాఖల అధికారుల సమన్వయంతో మహా నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేశారు. నిమజ్జనం సజావుగా సాగేందుకు రూట్ మ్యాప్‌తో పాటు భారీ క్రేన్‌లు, వాహనాలను సిద్ధం చేశారు. బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు చివరి పూజ నిర్వహించిన అనంతరం 12.01 గంటలకు అనంత చతుర్దశి ప్రారంభం కాగానే పూజలు నిర్వహించి కలశాన్ని కదిలిస్తారు. గురువారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో మహాగణపతి ఇరువైపులా ఉన్న పంచముఖ లక్ష్మీ నారసింహ స్వామి, వీరభద్ర స్వామి విగ్రహాలను మరో ట్రాయిలర్ వాహనంపై ఉంచుతారు. 4 గంటలకు క్రేన్ సాయంతో మహాగణపతిని ఎస్‌టీసీ ట్రాన్స్‌పోర్ట్ వాహనంపై ఉంచి వెల్డింగ్ పనులు ప్రారంభిస్తారు. ఉదయం 7 గంటలకు ఖైరతాబాద్ మహాగణపతి శోభాయాత్ర ప్రారంభమవుతుంది.

రూట్ మ్యాప్ ఇలా..

- నేటి ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే శోభాయాత్ర సెన్సేషన్ థియేటర్ నుంచి రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఎక్బాల్ మినార్, తెలుగుతల్లి చౌరస్తా, నూతన సచివాలయం ముందు నుంచి ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నెం 4 వద్దకు చేరుకుంటుంది.
- మధ్యాహ్నం 1.30లోపు మహాగణపతిని నిమజ్జనం చేయాలని పోలీసులు ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు సందీప్ రావు, రాజ్‌కుమార్ తెలిపారు.

ఎస్‌టీసీ ట్రాయిలర్ వాహనం సిద్ధం..

మహాగణపతిని నిమజ్జనానికి తరలించే ఎస్‌టీసీ ట్రాన్స్‌పోర్ట్ వాహనం 65 ఫీట్ల పొడవు, 11 ఫీట్ల వెడల్పు, 26 టైర్లతో ఉంది. ఇది 55 టన్నుల బరువు మోస్తుంది. 63 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పు ఉన్న మహాగణపతి విగ్రహం సుమారు 40 టన్నుల బరువు ఉంటుంది. ట్రాయిలర్ వాహనం సునాయాసంగా మహాగణపతిని నిమజ్జనానికి సాగర తీరానికి చేరుస్తుంది.

11వ సారి రథసారథిగా భాస్కర్ రెడ్డి

నాగర్ కర్నూల్‌కు చెందిన దొడ్ల భాస్కర్ రెడ్డి ఖైరతాబాద్ మహాగణపతిని నిమజ్జనానికి 11వ సారి రథసారథిగా వ్యవరిస్తున్నారు. ఐదు లేయర్లపై వాటర్ పెయింట్స్‌ను వాడటం వల్ల వర్షం 4–5 గంటలు కురిసినా విగ్రహం ఏమాత్రం కరగదు. నిమజ్జనం పూర్తిగా జరిగితే 8 గంటల్లో నీటిలో కరుగుతుంది.

ఆ రెండు పార్టీలతోనే వెనుకబాటు

- అభివృద్ధిని అడ్డుకునేవి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలే
- రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు
- ప్రగతి ప్రస్తావన సభలో మంత్రి హరీశ్‌రావు
- సభకు పదేపదే అడ్డుతగిలిన అంగన్‌వాడీలు



సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

తాండూరు: దేశం వెనుకబాటుతనానికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలే కారణమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. తాండూరు పట్టణంలోని విలియంమూన్ స్కూల్ మైదానంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రగతి ప్రస్తావన సభకు మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రోహిత్‌రెడ్డి, మెతుకు ఆనంద్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. దేశాభివృద్ధిని అడ్డుకునేవి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలేనన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో 60 ఏళ్లు అధికారంలో ఉందని, బీజేపీ 15 ఏళ్లుగా అధికారంలో ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో 76 శాతం ప్రసవాలు జరుగుతున్నాయన్నారు. తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఏకంగా 83 శాతం ప్రసవాలతో రికార్డు సృష్టించామన్నారు. జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలను మరింత మెరుగు పర్చేందుకు త్వరలో ఎంఆర్ఐ, సీటీ స్కానింగ్ యంత్రాలను మంజూరుచేస్తామన్నారు. కోట్‌పల్లి ప్రాజెక్ట్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కోరగా.. ప్రాజెక్టు అభివృద్ధికి రూ.40 కోట్లను త్వరలో మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ దీప, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వీణ, బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రసంగానికి అడ్డుతగిలిన అంగన్‌వాడీలు

ప్రగతి ప్రస్తావన సభకు వచ్చిన మంత్రి హరీశ్‌రావును కలిసి తమగోడు వెళ్లబోసుకోవాలనుకున్న అంగన్‌వాడీలకు నిరాశే మిగిలింది. నిరసనను ముందే పసిగట్టిన పోలీసులు బుధవారం ఉదయమే కీలకమైన అంగన్‌వాడీ టీచర్లను, సీఐటీయూ నాయకులను అరెస్టు చేశారు. దీంతో సభకు చేరుకున్న అంగన్‌వాడీలు పదేపదే ఆటంకం కలిగించారు. మంత్రి హరీశ్‌రావు ప్రసంగం మొదలుపెట్టగానే ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. మంత్రి సముదాయించే ప్రయత్నం చేసినా వారు వినలేదు. ఈ క్రమంలో కొందరు అంగన్‌వాడీ సిబ్బంది బారికేడ్లను తొలగించి సభా వేదికలోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. సభ అనంతరం అంగన్‌వాడీలు మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని తప్పించి కాన్వాయ్ ముందుకు పంపించారు. సభలో న్యూసెన్స్ సృష్టించారని పలువురు పరిగి, వికారాబాద్ ప్రాంతాలకు చెందిన అంగన్‌వాడీలపై పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసులు నమోదు చేశారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి

- మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: సీఎం సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దామని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రూ.26 కోట్లతో నిర్మించనున్న పాలిటెక్నిక్ కళాశాల భవనం, రూ.10 లక్షలతో చేపట్టే కార్మిక భవనం, రూ.15 లక్షలతో కురుమ సంఘం భవనం, రూ.1.20 కోట్లతో నిర్మించే జూనియర్ కళాశాల భవనం, రూ.కోటితో ఉప్పుగడ్డ తండాలో నిర్మించే సేవాలాల్ దేవాలయం వద్ద మండపం, రూ.90 లక్షల నిధులతో వీరశైవ లింగాయత్, గాండ్ల సంఘం, ఆర్యవైశ్య సంఘం, మున్నూరుకాపు సంఘం, ఆరెకటిక, బుడగజంగాల, గంగపుత్ర సంఘం పద్మశాలి కుల సంఘాలకు నిర్మించే ఆత్మగౌరవ భవనాలకు బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి స్ఫూర్తితో నియోజకవర్గంలో అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పల్లె ప్రగతితో గ్రామాల్లో సమూల మార్పులు వచ్చాయని, స్వచ్ఛతకు నిలయాలుగా మారాయన్నారు. మన తెలంగాణ పల్లెలకు జాతీయ స్థాయిలో అవార్డులు రావటమే అందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ సునీతానాయక్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం: అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి తదితరులు

బీఆర్ఎస్‌కు మద్దతు పలకండి

పహాడీషరీఫ్: నియోజకవర్గంలో కొనసాగుతున్న కోట్లాది రూపాయల అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్ఎస్‌కు మద్దతు పలకాలని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో రూ. 21.67 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్లు, కచ్చామోరీల నిర్మాణ పనులకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. జల్‌పల్లి కమాన్ వద్ద అర్బన్ ఫారెస్ట్ పార్కులో మహిళల కోసం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. జల్‌పల్లి మున్సిపాలిటీలో గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో వందలాది కోట్ల రూపాయలు వెచ్చించి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వసంత, వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, కో–ఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత



పట్టుబడిన బంగారం

శంషాబాద్: అక్రమంగా తరలిస్తోన్న బంగారాన్ని ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఉదయం జెడ్డా నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడిని తనిఖీలు చేయగా అతడి లోదుస్తుల్లో 399 గ్రాముల బంగారం లభ్యమైంది. బంగారం విలువ రూ.24.34 లక్షలుంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘చిల్లర’ ఇస్తానంటాడు.. డబ్బుతో ఉడాయిస్తాడు


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ జగదీశ్వర్ రెడ్డి

రాజేంద్రనగర్: చిల్లర డబ్బే పెట్టుబడిగా పలువురిని నమ్మించి మోసం చేస్తున్న ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. బుధవారం డీసీపీ జగదీశ్వర్ రెడ్డి తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను వెల్లడించారు. వెస్ట్ గోదావరికి చెందిన అమరేశ్వర్ నాథ్ (28) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ప్రముఖ కంపెనీలో మంచి ఉద్యోగం చేసేవాడు. కరోనా సమయంలో ఉద్యోగం పోవడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు తోడయ్యాయి. ఈ క్రమంలో సులువుగా డబ్బులు సంపాదించాలని శంకర్‌పల్లి, మాదాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మాల్స్, దుకాణాలు, పెట్రోల్ బంక్‌లను లక్ష్యంగా చేసుకున్నాడు. ఓ ప్రాంతంలో తన వద్ద చిల్లర ఉంది, నోట్లు కావాలని.. వరో ప్రాంతంలో నోట్లు ఉన్నాయని.. చిల్లర కావాలంటూ మాటలు కలిపి నమ్మించేవాడు. నగదును వివిధ పేటీఎం, గూగుల్‌పే లో వేసుకొని తన వాహనంపై మనిషిని పంపిస్తే నగదును ఇస్తానంటూ తీసుకెళ్లేవాడు. కొద్ది దూరం వెళ్లాక ఇది తన ఆఫీస్, నివాసమంటూ చెప్పి ఉడాయించేవాడు. ఇలా ఐదు కేసుల్లో పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చాడు. మళ్లీ మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, నార్సింగ్, మొయినాబాద్, గచ్చిబౌలి, చేవెళ్ల పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఏడు కేసుల్లో డబ్బులు తీసుకుని ఉడాయించాడు. ఫిర్యాదు అందుకున్న చేవెళ్ల, రాజేంద్రనగర్ పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. విచారణలో మరో ఏడు కేసుల వివరాలను తెలిపాడు. మరిన్ని కేసుల్లో ముద్దాయి అని, త్వరలో కస్టడీకి తీసుకొని విచారిస్తామని డీసీపీ తెలిపారు.


చేవెళ్ల: అంబేద్కర్ (పోచమ్మగుడి)కాలనీలో రూ.10లక్షలకు లడ్డూ కైవసం చేసుకున్న కృష్ణారెడ్డి, సుదర్శన్, శ్రీనివాస్


చేవెళ్ల: అంబేద్కర్ కాలనీలో రూ.10లక్షలు పాడిన సరయు గ్రూప్ సభ్యులు

లడ్డూ వేలం.. భక్తుల కోలాహలం

- రూ.లక్ష నుంచి రూ.10లక్షల వరకు పలికిన ధర
- పోటీపడి దక్కించుకున్న భక్తులు

మీర్‌పేట: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో లడ్డూ వేలం ప్రత్యేకమైన ఘట్టం. లడ్డూ వేలం అనగానే గుర్తుకు వచ్చేది బాలాపూర్ గణేశ్ ఇక్కడ ఏటేటా రేటు పెరుగుతూ వస్తుంది. కానీ నగరంలో ఏర్పాటు చేసిన మండపాల్లో రూ.లక్షల్లో వేలం పాడేందుకు భక్తులు పోటీ పడుతూ బాలాపూర్ రికార్డు తిరగరాస్తున్నారు. తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న లడ్డూను వేలంలో దక్కించుకునేందుకు భక్తులు పోటీ పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన వేలంలో రూ.లక్ష నుంచి రూ.10లక్షల వరకు పాటపాడి భక్తులు లడ్డూలు కైవసం చేసుకున్నారు.

గ్రామాల్లోనూ జోరు

చేవెళ్ల: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వేలం జోరుగా సాగింది. మండల కేంద్రంలోని మల్లికార్జున కాలనీలోని గణపతి లడ్డూను నత్తి క్రిష్టారెడ్డి, చెన్నెంకి శ్రీనివాస్, కొజ్జెంకి సుదర్శన్, సింగప్పగూడ రవి గ్రూప్ సభ్యులు 6.01లక్షలకు, హౌసింగ్ బోర్డు కాలనీలో రూ.3.11లక్షలకు ఎస్‌ఎం గ్రూప్ సభ్యులు, విశ్వకర్మ కాలనీలో రూ.3.20లక్షలకు వడ్ల శ్రీనివాస్‌చారి, భగత్‌సింగ్‌కాలనీలో బాల్‌రాజ్, మాధవ్, శివశంకర్, కుమార్, ఎండీ రఫీక్, మహేశ్‌లు రూ.2.52లక్షలకు, ఇబ్రహీంపల్లిలో శ్రీనిత్‌రెడ్డి రూ.లక్షకు, ముడిమ్యాలలో బూర్ల నిరంజన్ రూ.3.25లక్షలకు ఎర్రోని కోటాలలో రెండు లడ్డూలను రూ.1.16లక్షలకు మల్లేశ్, మహేశ్‌లు, దామరగిద్దలో రూ.71వేలకు పోతురాజు బ్రదర్స్ వేలంలో దక్కించుకున్నారు.

పోటీ పడిన ప్రజాప్రతినిధులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో నవరాత్రులు పూజలందుకున్న గణపతి నిమజ్జన వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండపాల వద్ద లడ్డూ వేలం నిర్వహించగా భక్తులు పోటీపడ్డారు. తుల్జాభవానీ ఆలయం వద్ద ప్రతిష్ఠించిన గణపతి లడ్డూను రూ.3లక్షలకు కేతావత్ తులసీరాం, జగదాంబ మాత వినాయకుడి వద్ద రూ.2లక్షలకు అనిల్‌కుమార్, గండి మైసమ్మ యూత్ లడ్డూను రూ.2లక్షలకు సునీల్‌కుమార్, హనుమాన్ యూత్ లడ్డూను రూ.1.70లక్షలకు ప్రదీప్, కనుబా వినాయకుడి రూ.1.50లక్షలకు పాండునాయక్, జానీ యూత్ లడ్డూను రూ.1.18లక్షలకు నరేశ్‌నాయక్, సభావట్ లడ్డూను రూ.1.05లక్షలకు దుద్యానాయక్ బుజ్జి, ఇస్లావత్ లడ్డూను రూ.1.12లక్షలకు రాజ్‌కుమార్, జటావత్ వినాయకుడి లడ్డూ రూ.90 వేలకు సర్దార్‌నాయక్, మహంకాళీ యూత్ లడ్డూను రూ.85 వేలకు జవహర్‌లాల్, ఎల్లమ్మ కాలనీ వినాయకుడి లడ్డూను రూ.95 వేలకు పాండునాయక్, శివాలయం కాలనీ గణపతి లడ్డూను రూ.60వేలకు ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ కైవసం చేసుకున్నారు.


కేశంపేట: సురేశ్‌కు లడ్డూ అందజేస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్


చేవెళ్ల: రజకనగర్‌లో రూ.7.62లక్షలకు దక్కించుకున్న రాములు అండ్ సన్స్


తుక్కుగూడ: రూ.7.11లక్షలకు కైవసం చేసుకున్న కరుణాకర్‌రెడ్డి, చిన్నారెడ్డి సోదరులు


యాచారం: నందివనపర్తిలో రూ.1.09లక్షలకు వేలం పాడిన యాదయ్య


చేవెళ్ల: హౌసింగ్‌బోర్డు కాలనీలో రూ.3.11లక్షలకు ఎస్‌ఎం గ్రూప్ సభ్యులు


మీర్‌పేట: నందిహిల్స్‌లో రూ.3.20లక్షలు పాడిన కృష్ణారెడ్డి


చేవెళ్ల: గుండాలలో రూ.2లక్షలకు రచ్చబండ ఉత్సవ కమిటీ సభ్యులు


మీర్‌పేట: టీఎస్‌ఆర్ కాలనీలో రూ.1.17లక్షలకు శ్రీరామచంద్రమూర్తి


కడ్తాల్: మైసిగండి పెద్ద వినాయకుడి లడ్డూను కైవసం చేసుకున్న సర్పంచ్ తులసీరాంనాయక్

భయపెట్టి అసైన్డ్ భూముల కొనుగోలు

సర్వసభ్య సమావేశంలో రైతుల ఆవేదన

శంషాబాద్ రూరల్: పేదలకు ప్రభుత్వం అసైన్డ్ చేసిన భూములను కొంత మంది దళారులు భయపెట్టి తక్కువ ధరలకు కాజేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని చిన్న గోల్కొండ సొసైటీ ఆవరణలో చైర్మన్ దానాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కొంత మంది రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. సయ్యద్‌గూడ, పెద్దగోల్కొండ, బహదూర్‌గూడ రెవెన్యూ పరిధిలో వందల ఎకరాలు రైతులకు అసైన్డ్ చేశారు. ఈ భూములను ప్రభుత్వం తిరిగి తీసుకుంటుందని భయపెడుతూ కొంత మంది దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. అమ్ముకుంటే దారి లేకుండా చేయడం.. కుటుంబ సభ్యులకు తగాదా సృష్టించి అమ్ముకునేలా చేస్తున్నారని రైతులు పేర్కొన్నారు. దళారుల వెనక కొంత మంది పెద్దల హస్తం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఇదిలా ఉండగా బహదూర్‌గూడలో రైతులకు పట్టా పాసుపుస్తకాలు జారీ చేయాలని కోరారు. అంతకుముందు చైర్మన్ మాట్లాడారు. రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు దేవేందర్‌రెడ్డి, మోహన్‌రావు, రూప, విజయలక్ష్మీ, ప్రశాంత్‌రెడ్డి, బాల్యానాయక్ పాల్గొన్నారు.

ముగిసిన విస్తరణ విద్యాసంస్థ వజ్రోత్సవాలు

ఏజీవర్సిటీ: ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని విస్తరణ విద్యాసంస్థ వజ్రోత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఈ ముగింపు సమావేశంలో ప్రణాళికా సంఘం మాజీ సలహాదారులు డాక్టర్ వీపీ సదావతే పాల్గొని మాట్లాడారు. రైతులకు అధునాతన టెక్నాలజీల ద్వారా మరింత విస్తరణ సేవలు అందించడానికి కృషి చేయాలన్నారు. వ్యవసాయ విస్తరణలో కొత్త విధానాల కోసం పనిచేస్తున్న సంస్థలన్నీ సమన్వయంతో పనిచేయాలని ఇలాంటి సదస్సుల్లో వచ్చిన నూతన విస్తరణ ప్రతిపాదలను కొన్నింటిని ప్రయోగాత్మకంగా అమలు చేయడంపై శాస్త్రవేత్తలు దృష్టి సారించాలన్నారు. ఉత్తమ విస్తరణ అధికారులు, ఉత్తమ విస్తరణ శాస్త్రవేత్తలు, ఉపాన్యాసకులకు అవార్డులు అందించారు.

మతసామరస్యానికి ప్రతీకగా గణేష్ ఉత్సవాలు

రాజేంద్రనగర్: గణేష్ ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ గంగాధర్ వెల్లడించారు. రాజేంద్రనగర్ చౌరస్తాలో మజ్లిస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు షేక్ రియాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత వేదికలపై నుంచి మజ్లిస్ పార్టీ నాయకులు, ముస్లింలు గణేష్ ప్రతిమలకు స్వాగతం పలికారు. ఈ విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ ఏసీపీ గంగాధర్, ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర బాబు ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు శ్రీధర్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు వేదిక వద్దకు వచ్చి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... సోదరభావంతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. రాజేంద్రనగర్‌లో మతసామరస్యానికి ప్రతీకగా గణేష్ ఉత్సవాలు కొనసాగుతున్నాయన్నారు.

భర్తను బైక్‌పై వెళ్లమని..

ఇద్దరు పిల్లలతో గృహిణి అదృశ్యం


అనిత(ఫైల్)


నిహారిక(ఫైల్)


రిషిక(ఫైల్)

పహాడీషరీఫ్: ఇద్దరు పిల్లలతో కలిసి గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కె.మధుసూదన్ తెలిపిన ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం గొల్లోనిపల్లికి చెందిన గోగుల శ్రీను తన భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి ఈ నెల 23న తుక్కుగూడలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లాడు. 26న స్వగ్రామానికి బయలు దేరారు. దీంతో అనిత(29) తాను కంటి సమస్యతో బాధపడుతున్నాని కూతుర్లు నిహారిక(8), రిషి(5)ని తీసుకుని బస్‌కు వస్తానని.. కుమారుడిని తీసుకుని బైక్‌పై వెళ్లమండని భర్తకు సూచించింది. ఇంటికి చేరకున్న శ్రీను భార్య ఎంతకూ రాలేదు. ఆయన ఎక్కడ వెతికినా ఆచూకీ లభ్యమవ్వక పోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పీఎస్‌లో గానీ, 87126 62367 నెంబర్‌లో గాని సమాచారం అందించాలని కోరారు.

ఆయన సేవలు యువతకు ఆదర్శం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

- ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి
- విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ తొలిదశ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ యువతకు ఆదర్శమని షాద్‌నగర్ ఎమ్మెల్యే అందజయ్య యాదవ్ అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం పద్మశాలీయుల బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో నిజాం సర్కారుతో, రజాకారులతో పోరాడిన గొప్ప వ్యక్తి కొండాలక్ష్మణ్‌బాపూజీ అన్నారు. ఉద్యమం కోసం ఆనాడే తన మంత్రి పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. పద్మశాలీయులకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందన్నారు. అనంతరం సంఘం నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎం ఎస్.నటరాజ్, కో ఆప్షన్ సభ్యుడు ఒగ్గుకిషోర్, కమిషనర్ వెంకన్న, పద్మశాలి సంఘం అధ్యక్షుడు కోటజనార్దన్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఇప్పలపల్లి లక్ష్మి, సభ్యులు మౌనిక, అరుణ, నాయకులు అగ్గనూరు విశ్వం, నారాయణరెడ్డి, శ్రీశైలంగౌడ్, నందకిషోర్, చెన్నయ్య, నర్సింలు, కృష్ణయ్య, రామస్వామి, రాములు, పూర్ణ, రమేష్, శివ, దాసరమేష్, బాలు, చెన్నబాలరాజు, రాజేందర్, అంజయ్య, హరి, రాజు, భాస్కర్, సుంకూరు నరేందర్, ఇస్నగారి శ్రీనివాస్, ఆంజనేయులు, శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఐఆర్‌డీపీఆర్‌లో ముగిసిన శిక్షణ



శిక్షణ పూర్తి చేసుకున్న వారితో అధికారులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్‌లో నాగర్‌కర్నూల్ జిల్లాలోని అప్పాపూర్, బోరాపూర్ గ్రామాలకు చెందిన గిరిజనులకు లీవ్స్ ప్లేట్లు, కప్పుల తయారీ కోసం ఇస్తున్న శిక్షణ ముగిసింది. రాష్ట్రంలోని గిరిజన, చెంచులకు పలు రంగాలలో శిక్షణ ఇవ్వాలని గవర్నర్ తమిళిసై సౌందరాజన్ ఆదేశాల మేరకు గత మూడు నెలలుగా శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ నరేంద్రకుమార్, అధికారులు పాల్గొన్నారు.